క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సత్యం

గంగాధర: సీఎం రేవంత్‌రెడ్డిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల విడుదలపై విన్నవించారు. చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంట ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



కరీంనగర్ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులు

మానకొండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)కు చెందిన విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఇందులో భాగంగా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లోని పాలకేంద్రం, కరీంనగర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ, జిల్లా సైన్స్ మ్యూజియంను సందర్శించి, పలు విషయాలు తెలుసుకున్నారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు వివిధ సంస్థలపై అవగాహన కోసం ఈ పర్యటన చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత స్థాయిలో రాణించాలని లక్ష్మీదేవిపల్లి నరేంద్ర విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేశం సూచించారు. పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

శంకరపట్నం: రెండు శునకాలు కొట్లాడుకుంటూ ద్విచక్రవాహనానికి అడ్డురావడంతో కింద పడి, ఓ వృద్ధుడు గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని ఆరెపల్లికి చెందిన గుంటి ఐలయ్య(65) శనివారం కొత్తగట్టుకు ద్విచక్రవాహనంపై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. కొత్తగట్టు శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద శునకాలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి, ఐలయ్య కిందపడ్డాడు. అతని చేయి విరిగింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ అక్కడికి చేరుకుంది. బాధితుడికి ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ అందించి, కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

నిలిచిన బ్యాంకు సేవలు

శంకరపట్నం: కేశవపట్నం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శనివారం సర్వర్ పని చేయలేదు. దీంతో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సాయం ఖాతాల్లో జమ అవుతుండటంతో డ్రా చేసుకునేందుకు ఎక్కువ మంది వచ్చారు. సర్వర్ సోమవారం పని చేస్తుందని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు.

ఆలయంలో అన్నదానం



జమ్మికుంట: మధ్యప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి జన్మదినం సందర్భంగా అలయ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గాదె గుణసాగర్, జర్నలిస్టుల ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయం (బొమ్మలగుడి)లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఫౌండేషన్ స్థాపించిన నరహరి పేదల కోసం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాయకులు రామారావు, రాజు, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో హనుమాన్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఫార్చ్యూన్ మెడికేర్ ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు వైద్యులు బీపీ, షుగర్, గుండె పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి మణిశంకర్‌రెడ్డి, సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ అధికారులు

మానకొండూర్: మండల కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు వైద్య విధాన పరిషత్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేపట్టారు. మానకొండూర్ పీహెచ్‌సీ గదులు ఇరుకుగా ఉండటం, పేషెంట్ల సంఖ్య పెరగడంతో వారితోపాటు వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు నిధులు మంజూరు చేయించారు. వైద్య విధాన పరిషత్ అధికారుల బృందం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వి.రవి ప్రవీణ్‌రెడ్డి, ఏవో హైమద్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, డ్రాఫ్ట్‌మెన్ అనిల్, సర్వేయర్ జీవన్‌రెడ్డి మానకొండూర్ వచ్చారు. పీహెచ్‌సీ పరిధి స్థలంతోపాటు పక్కనున్న మార్కెట్ యార్డు, మహిళా సంఘ భవనం పరిధిలోని స్థలానికి కొలతలు తీశారు. 2.38 గుంటల భూమి అనవరం ఉండగా, 2.15 గుంటలు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.

హామీలపై ప్రజాక్షేత్రంలో నిలదీయండి



కమలాపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్: హామీలపై కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలో నిలదీయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సూచించారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన సమావేశమై, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్‌పై విసుకు చెందిన రాష్ట్ర ప్రజలందరూ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేయడం లేదని, ఈ విషయంలో ఎప్పటికప్పుడు నిలదీయాలని చెప్పారు. రాబోయే ఏ ఎన్నికల్లోనైనా బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మణ్‌రావు, నాయకులు తిరుపతిరావు, సత్యనారాయణరావు, ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండువాలపై ముదిరాజ్‌లు ఆలోచించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నంబర్ ప్లేట్ లేని కారు డిక్కీలో ముదిరాజ్‌లకు సంబంధించిన కండువాలు ఎందుకున్నాయో ముదిరాజ్ కులబాంధవులు ఆలోచించాలని బీజేపీ నాయకులు అన్నారు. చిగురుమామిడిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత గురువారం పోలింగ్ సమయంలో ఓ కాంగ్రెస్ నాయకుడి కారు డిక్కీని ఓపెన్ చేశామన్నారు. అందులో ఆ పార్టీకి చెందిన కరపత్రాలు, వేర్వేరు నంబర్ ప్లేట్లు ఉన్నాయని, వాటిని మీడియాకు చూపించే క్రమంలో ముదిరాజ్‌లకు సంబంధించిన కండువాలు కిందపడ్డాయని తెలిపారు. ఈ విషయమై తాము విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్, నాయకులు చెరుకు రాజయ్య, మల్లం సతీశ్, గూల్ల సాయికృష్ణ, పెసరి హరీశ్, గందె చిరంజీవి తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

చొప్పదండి: గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి అతని స్నేహితులు ఆర్థికసాయం చేసి, అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. చొప్పదండి మండలంలోని భూపాలపట్నంకు చెందిన గుర్రం దేవేందర్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో చనిపోయాడు. చొప్పదండి పట్టణంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో అతనితో కలిసి పదోతరగతి చదివిన 1994–95 బ్యాచ్ విద్యార్థులు తలా కొంత నగదు పోగేశారు. మొత్తం రూ.41 వేలను మృతుడి కుటుంబసభ్యులకు శనివారం అందజేశారు. మాజీ కౌన్సిలర్ కొట్టె అశోక్, రెడ్డి సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి మణిశంకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, న్యాయవాది శంకరయ్య తదితరులున్నారు.

‘బీమా వర్తింపజేయకపోవడం అన్యాయం’

గుండెపోటుతో మృతి చెందిన రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతు బీమా వర్తింపజేయకపోవడం అన్యాయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం చొప్పదండిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపట్నంలో దేవేందర్ రెడ్డి అనే రైతు ఇటీవల గుండెపోటుతో చనిపోయాడని తెలిపారు. వ్యవసాయాధికారులకు సమాచారం ఇస్తే అతని కుటుంబానికి రైతుబీమా ఇవ్వలేమని చెప్పడం దారుణమన్నారు. 2022లో పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతు పేరును పథకంలో చేర్చడంలో అధికార యంత్రాంగం విఫలమైందని మండిపడ్డారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించి, మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు తొట్ల తిరుపతి, గుడిపాక సురేశ్, గొల్ల గట్టయ్య, బైరగోని కిట్టుగౌడ్, సింగిరెడ్డి భూంరెడ్డి, మొగిలి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట: అదనపు వరకట్నం కోసం ఓ వివాహితను వేధింపులకు గురిచేస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన ప్రసూషకు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రానికి చెందిన వెలగందుల రాకేశ్‌తో 2017లో వివాహం జరిగింది. కొంతకాలంగా భర్తతోపాటు అత్తామామ విజయలక్ష్మి–సత్యనారాయణ, ఆడపడుచు అరవపల్లి లావణ్య, ఆమె భర్త కిశోర్‌లు అదనపు వరకట్నం తీసుకురావాలంటూ ప్రసూషను వేధిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎలగందల్, ధన్గర్‌వాడీ స్కూళ్ల సందర్శన



ఎలగందల్ స్కూల్లో ఎంఈవో, విద్యార్థులు



మ్యూజియం వద్ద విద్యార్థులు, టీచర్లు

గన్నేరువరం: పీఎం శ్రీ పథకంలో భాగంగా మండలంలోని గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం కొత్తపల్లి మండలం ఎలగందల్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యాబోధన, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, భోజనం, టిఫిన్ అమలు తీరును పరిశీలించారు. పీఎం శ్రీ పథకానికి ఎంపికైన ఒక స్కూల్ విద్యార్థులు మరో స్కూల్‌ను సందర్శిస్తున్నట్లు ఎంఈవో, పాఠశాల హెచ్‌ఎం రామయ్య తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆ స్కూల్లో సైన్స్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం జిల్లా సైన్స్ మ్యూజియంకు వెళ్లారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ బాధాకరం

గన్నేరువరం: ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం బాధాకరమని సామాజికవేత్త జాగిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం గునుకులకొండాపూర్‌లో ఆయన మాట్లాడారు. బహుజన వాదం వినిపించే తీర్మార్ మల్లన్న సస్పెన్షన్ ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఆయన తనవంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్లో ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలి

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో దాదాపు 70 గుట్టలపై గ్రానైట్ తవ్వకాలకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని రైతు ఐక్యత సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. దీంతో కొందరు బడా వ్యాపారులు ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. శనివారం చిగురుమామిడిలో ఆయన మాట్లాడారు. తవ్వకాల కారణంగా కోతులు గ్రామాల్లోకి వచ్చి, పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం స్పందించి, గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని కోరారు.

బీమా సొమ్ము అందజేత

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో పురుషుల పొదుపు సంఘం సభ్యుడు బొంగోని చక్రపాణి ఇటీవల మృతిచెందాడు. బీమా సొమ్ము రూ.70 వేలను సంఘం అధ్యక్షుడు రాచర్ల మల్లేశం శనివారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశం, రమేశ్, రాజేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌రూరల్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను వార్డు అధికారులు వెంటనే పరిష్కరించాలని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అన్నారు. ఆదివారం మున్సిపల్ విలీన గ్రామం దుర్శేడ్‌లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. డంపింగ్‌యార్డును సందర్శించి వార్డు కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. తాగునీటి సరఫరాలోని సమస్యలు, నీటి పన్నుల వసూళ్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుర్శేడ్‌లో పారిశుధ్య పనులు మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పిన్‌పాయింట్ పద్ధతి ప్రకారం కాలనీల్లో పరిశుభ్రత పనులు చేయాలన్నారు. డంప్ యార్డును వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు. ఎన్విర్మాన్‌మెంట్ ఇంజినీర్ స్వామి, వార్డు అధికారి మణిదీప్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కృష్ణన్ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న తపాలా ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణంలోని తపాలా కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు, జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉన్నత కార్యదర్శి కామ్రేడ్ ఎం.కృష్ణన్ వర్ధంతి నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం కృష్ణన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ అమర్నాథ్‌రెడ్డి, హుజూరాబాద్ గ్రూప్ సి బ్రాంచి కార్యదర్శి జక్కు రజినీకాంత్, గ్రూప్ డి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.తిరుపతినాయక్, నాయకులు పాల్గొన్నారు.

నాలా ఆక్రమణలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ముదిరాజ్ నాయకులు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ మామిడికుంట నాలా ఆక్రమణలకు గురువుతోంది. శనివారం మట్టి పోస్తుండగా ముదిరాజ్ సంఘం నాయకులు అక్కడికి చేరుకొని, ఆందోళనకు దిగారు. ఏళ్లుగా ఉంటున్న ఈ నాలా ఆక్రమణల కారణంగా మూసుకుపోతుండటంతో వానాకాలంలో వరద నీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. వెంటనే పనులు ఆపేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించడంతో మట్టి పోస్తున్నవారు వెనుదిరిగారు. ఈ విషయంలో అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతోపాటు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని నాయకులు ఆరోపించారు.

‘అక్రమ నిర్మాణాలు తొలగించండి’



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

జమ్మికుంట: ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని దళిత సంఘం నాయకుడు కనకం తేజ ఒక ప్రకటనలో కోరారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి మారుతీనగర్‌లో సర్వే నంబర్ 887లోని మానసిక వికలాంగుల ఆశ్రమం పక్కన గల సర్కారు భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి, వాటిని తొలగించాలని, సదరు భూమిని నిరుపేదలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పన్నుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

చొప్పదండి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగుస్తున్నందున చొప్పదండి పట్టణంలో ఆస్తి, నీటి పన్నులు, లైసెన్స్, అడ్వర్టైజ్‌మెంట్ ఫీజులను బకాయిదారులు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంతమంది బకాయిదారులు పన్నులు చెల్లించడం లేదని, వారిపై దృష్టిసారించాలన్నారు. గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం, తెలంగాణ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమ అమరులకు నివాళి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



కేశవపట్నంలో..

హుజూరాబాద్: వర్గీకరణ ఉద్యమ అమరవీరులకు హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు నివాళి అర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రారపు రామచంద్రం, జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, మాజీ కౌన్సిలర్ ముక్క రమేశ్, ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ మండల అధ్యక్షుడు ఇమ్మడి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్, జిల్లా నాయకులు బొరగాల రాజ్‌కుమార్, మొలుగూరి ప్రభాకర్, మోరె మధు, ఎర్ర రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ఎస్సీ వర్గీకరణ ఉద్యమ అమరులకు శనివారం జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సమితి రాష్ట్ర నాయకులు రామంచ భరత్, రుద్రారపు రామచంద్రం, ఆకినపల్లి సమ్మయ్య, తునికి వసంత్, పర్లపల్లి రవీందర్, మండల అధ్యక్షుడు బోయిని సదానందం, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైనవారికి ఇల్లందకుంట ప్రధాన చౌరస్తా వద్ద శనివారం ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు గుండ్ల గణపతి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాటలు పాడుతూ నినాదాలు చేశారు. నాయకులు తునికి వసంత్, దొడ్డె అనిల్, పర్లపల్లి రవీందర్ తదితరులున్నారు.

శంకరపట్నం: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చిత్రపటానికి శనివారం కేశవపట్నంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళి అర్పించారు. మండల ఇన్‌చార్జి మహేశ్, మాజీ సర్పంచ్‌లు కొండ్ర రాజయ్య, దాసారపు భద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో సైన్స్ ఫేర్



ఎగ్జిబిట్స్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్ తయారు చేసి, ప్రదర్శించారు. అతిథులు వాటిని పరిశీలించి, తయారీ విధానం, ఉపయోగాలను తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తిరుమల, సైన్స్ ఉపాధ్యాయురాలు శ్రావణి, టీచర్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన తప్పనిసరి

ప్రతీ విద్యార్థికి సైన్స్‌పై అవగాహన తప్పనిసరని ఎన్‌ఐటీ వరంగల్ భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సౌరబ్ రాయ్ అన్నారు. హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను వస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేసేందుకు కాలేజీలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. కొత్తగా వస్తున్న సాంకేతిక అంశాలపై అధ్యాపకులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రాజేశ్వరరావు, లెక్చరర్లు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన మడ్డి ఉమ–సంపత్‌గౌడ్ దంపతుల మొదటి కూతురు వివాహం నిశ్చయమైంది. పేద కుటుంబం కావడంతో మాజీ ఉప సర్పంచ్ బుడిడె పర్శరాములు గౌడ్ రూ.10 వేలు, పొలంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ బుడిగె కొండయ్య గౌడ్ రూ.10 వేలు నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్ రూ.5 వేలు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి రూ.5 వేలు, మన్నెంపల్లి మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ రూ.5 వేలు, బీఆర్‌ఎస్ నాయకురాలు బత్తిని కీర్తిలతగౌడ్ రూ.10 వేలు శనివారం అందజేశారు.